క్లుప్తంగా

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడి రాజీనామా


ద్వారకనాథరెడ్డి

మదనపల్లె సిటీ: మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు డాక్టర్ పి.ద్వారకనాథరెడ్డి రాజీనామా చేశారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ 2023 నుంచి అధ్యక్షుడిగా పనిచేస్తున్నానని, వయసు రీత్యా సంఘం కార్యకలాపాల్లో పాల్గొనలేక పోతున్నామని తెలిపారు. సంఘం కోశాధికారి అంకిరెడ్డి అకాల మరణం చెందారని, దాని కారణంగా ప్రస్తుత కమిటీని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త కమిటీ ఏర్పాటుకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. ఇప్పటి వరకూ తనకు సహకరించిన సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఒకే ఈతలో రెండు దూడలు


రెండు దూడలకు జన్మనిచ్చిన పాడి పశువు

రామసముద్రం: పాడి ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. రామసముద్రం మండలం కెసి.పల్లి పంచాయతీ గుంతయంబాడి గ్రామానికి చెందిన కృష్ణయ్యగారి మంజునాథ రావు డైరీఫామ్‌లో హెచ్ఎఫ్ పాడి ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. అందులో ఒకటి పాయ, ఒకటి కోడె దూడ కావడంతో రెండూ సురక్షితంగా ఉన్నాయి. ఆవు నుంచి పాలు పితకకుండా మొత్తం పాలను దూడలకు వదిలేస్తున్నారు.

20న తిరుప్పావడసేవ

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ఈ నెల 20వ తేదీన తిరుప్పావడసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రమణ, ప్రధాన అర్చకులు గోవర్ధన్ భట్టార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

కలకడలో వర్షం

కలకడ: మండలంలో 10.4, గుర్రంకొండ, కెవి పల్లె, పీలేరు మండలాల్లో 8.2 నుంచి 8.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు డీవైఎస్ఓ మునినాయక్ తెలిపారు. చిన్నమండెం, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు.

వివాహ బంధంతో కొత్త జీవితం


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: మనిషి జీవితంలో వివాహం గొప్పదని, సరికొత్త జీవితానికి నాందియని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలోని అంగళ్లు భారత్ కళ్యాణ మండపంలో జరిగిన బురకాయలకోట ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా కుమారుడు సయ్యద్‌బాషా వివాహ వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పెళ్లి సరికొత్త జీవితానికి ఆరంభమన్నారు.

బ్లాక్‌బెల్ట్ పరీక్షల్లో ప్రతిభ


బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు

పీలేరు: స్థానిక రాజీవ్ నగర్‌లో జేకేడీ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరాటే మాస్టర్ దామోదర్ పేర్కొన్నారు. మదనపల్లెకు చెందిన దీపక్‌ఆచారి, పీలేరుకు చెందిన చరణ్ కుమార్, ప్రవీణ్, సారాఫాతిమా, అబూబకర్, హేమ, చందన్‌తో పాటు ప్రొద్దుటూరుకు చెందిన ముగ్గురు విద్యార్థులు బ్లాక్ బెల్ట్ పోటీల్లో పాల్గొని ఎనిమిది మంది విజయవంతమైనట్లు తెలిపారు. సయ్యద్ మాస్టర్, దస్తగిర్, సుహైల్, అబ్బాస్‌లు పరీక్షలను పర్యవేక్షించారు.

అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

నిమ్మనపల్లె: ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని బండ్లపై గ్రామానికి సిబ్బందితో కలిసి వెళ్లారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు చేస్తే ఎదుర్కోవాల్సిన సమస్యలపై వివరించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ...డబ్బు రెట్టింపుచేసే యాప్‌లను నమ్మవద్దన్నారు. ఇన్‌స్టంట్ లోన్ యాప్ మోసాలు, వేధింపులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు షేర్ చేయవద్దని సూచించారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఏ దారి చూసినా గతుకులమయమే?


గోతులమయమైన కురవపల్లె రోడ్డు


వడ్డిపల్లెకు అధ్వానంగా ఉన్న వడ్డిపల్లె రోడ్డు

పీలేరురూరల్: దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు పల్లెలు అని అందరూ చెప్పుకొంటారు. పల్లె ప్రగతిని ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. అధ్వానంగా, గోతులమయమైన రోడ్లే ఇందుకు నిదర్శనం. ఎన్నికల సమయంలో ప్రతి పల్లెకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ప్రజా ప్రతినిధులు గొప్పలు చెబుతున్నారేగానీ, తిరిగి ఎన్నికలు వచ్చేంత వరకూ వాటి గూర్చి పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని కావలిపల్లె పంచాయతీ పరిధిలోని కురవపల్లె, వడ్డిపల్లెకు, బాలంవారిపల్లె పంచాయతీ మొరవపల్లె, యర్రగుంటపల్లె పంచాయతీ నెట్టిబండకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఆయా గ్రామాల వాసులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఈ గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లు గోతులమయమై కనిపిస్తున్నాయి. వర్షం కురిస్తే బురద చేరి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోతోంది. తమ పల్లెలకు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చిన కూటమి అనంతరం అటువైపు రాలేదని చెబుతున్నారు. ఏదైనా అత్యవసర సమయంలో 108 వాహనాలు వచ్చేందుకు వీలులేనంతగా ఈ రోడ్డు అసౌకర్యంగా ఉంది. ఇక వృద్ధులు, విద్యార్థులు, మహిళల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి చేయాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.

ముళ్లపొదలు తొలగించండి


గుర్రంకొండ- సుంకరవాండ్లపల్లె మార్గంలో ముళ్లపొదలు

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల రహదారుల పక్కన ముళ్ల పొదలు పెరిగి స్థానిక గ్రామాల వాసులు ఇబ్బంది పడుతున్నారు. దిగువ అమిలేపల్లె నుంచి చింతలవారిపల్లె వరకు, గుర్రంకొండ నుంచి సుంకరవాండ్లపల్లె రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదల పెరిగిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. రాత్రిళ్లు రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లగేజీలతో వచ్చే లారీలు ముళ్లపొదల వద్ద ఇబ్బందిపడాల్సి వస్తోందన్నారు. గతంలో అమిలెపల్లె, బురుజుపల్లె, రామాపురం మీదుగా బస్సు నడిపేవారన్నారు. రోడ్డుమార్గం సరిగ్గాలేక పోవడంతో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసు రద్దు చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి వెంటనే ముళ్లపొదలు తొలగించాలని వారు కోరుతున్నారు.

తారు రోడ్డు మంజూరు చేయాలి



మా గ్రామంలో సుమారు 40 ఇళ్లలో పలువురు నివాసముంటున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు సౌకర్యానికి నోచుకోలేదు. పీలేరు–రాయచోటి రోడ్డు నుంచి సుమారు రెండు కిలో మీటర్ల మేర మట్టి రోడ్డు ఉంది. వర్షాలకు సుకుపోయి అధ్వానంగా తయారైంది. వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది పడే పరిస్థితితి. అధికారులు స్పందించి తారు రోడ్డు మంజూరుచేయాలి.
– పురుషోత్తం, కురవపల్లె

ఏళ్ల తరబడి రోడ్డు లేక ఇబ్బందులు



ఏళ్ల తరబడి మా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామానికి ఉన్న మట్టి రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. ఎన్నికల ప్రచారంలో గ్రామానికి రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చిన నాయకులు అనంతరం పట్టించుకోవడం లేదు. వర్షం వస్తే మొత్తం చిత్తడిగా మారుతోంది. ఇప్పటికైనా మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి.
– రెడ్డిశేఖర్, వడ్డిపల్లె

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం


అల్పాహారం అందజేస్తున్న జర్నలిస్టులు

రాజంపేట టౌన్ : జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యమని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బచోటి భాస్కర్ తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని పేదలు, యాచకులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతి యేటా సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందులో భాగంగానే ఒకపూట అయినా పేదల ఆకలిని తీర్చే ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీయూడబ్ల్యూజే రాజీలేని పోరాటం సాగిస్తుందన్నారు. తమ యూనియన్ పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యధిక మంది జర్నలిస్టులు ఉన్న యూనియన్ కూడా తమదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ మలిశెట్టి సుబ్బనరసింహులు, నాయకులు ఉదయగిరి కల్యాణ్, మండ్ల శ్రీహరి, చామంచి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గుర్రంకొండ: ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని జమాయితే ఉలమా హింద్ రాష్ట ప్రధాన కార్యదర్శి ముఫ్తీ సయ్యద్ సాబీబ్ మసూమ్, స్టూడెంట్ ఇస్లామిక్ ఏపీ జోనల్ అధ్యక్షుడు అమీర్ ఫహాద్ అన్నారు. మండలంలోని ఖండ్రిగ గ్రామంలో జరిగే అంద్రా విద్యా ఉద్యమం.. అన్వేషించు– ప్రోత్సహించు – సాధికారిత కార్యక్రమ పోస్టర్లను ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రా విద్యా ఉద్యమం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఏపీలో ముస్లీం మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్య అందేలా అకడమిక్ ఎక్సలెన్స్ కొసం తమ స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ఎంతో కృషి చేస్తోందన్నారు. పాఠశాల, కళాశాలల్లో డ్రాప్ అవుట్స్ లేకుండా అందరూ విద్య అభ్యసించేలా ప్రేరేపించేందుకు తమ సంస్థ ప్రయత్నిస్తోందన్నారు. ఆర్‌టీఈ రాష్ట్ర విద్యా విధానం, ఫీజు క్రమబద్ధీకరణ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయించేందుకు ప్రభుత్వం సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐవో జిల్లా ఆర్గనైజర్ అబ్దుల్ ముజీబ్, జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు ఆజంఅలీఖాన్,ఆబీద్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం


రవికుమార్‌రెడ్డి


రాజగోపాల్‌రెడ్డి

కలకడ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శులుగా కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చెర్మన్ బరకం రవికుమార్‌రెడ్డిలను నియమిస్తూ ఆ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినట్లు కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. పీలేరు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం, కార్యకర్తల కోసం కృషిచేసిన సీనియర్‌నాయకులు పదవులు పొందడం పై నియోజకవర్గ, జిల్లా కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసి, కార్యకర్తలకు అందుబాటులో ఉండి, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కమలాకర్‌రెడ్డి కోరారు. పార్టీని అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరూ సహకరించాలని ఎన్నికైన నాయకులు కోరారు.

విముక్తి జాతుల జీవన విధానం సమాజానికి స్ఫూర్తి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాయిలోకేష్

మదనపల్లె రూరల్: దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తున్న విముక్తి జాతుల జీవన విధానం సమాజానికి స్ఫూర్తిదాయకమని రాజంపేట పార్లమెంటరీ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సంచార జాతుల కోసం ఆగస్టు 30న బీజేపీ నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమ పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ.. ఆగస్టు 31న సంచార, విముక్త జాతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 30న విజయవాడ వెన్యూ ఫంక్షన్‌హాల్‌లో స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని సంచార కులాల వారందరినీ ఆహ్వానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, రేవన శివప్రసాద్, పులి నరేంద్రకుమార్‌రెడ్డి, బండి ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల కృష్ణమూర్తి, మట్టం కిరణ్‌కుమార్, పూలనాగరాజు, కురుముట్ల వెంకటేష్, పిల్లస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

లౌకిక పరిరక్షణ దినంగా తిరుమావళన్ జన్మదినం



సమావేశంలో మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె రూరల్: విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే పార్టీ) జాతీయ అధ్యక్షుడు చిదంబరం లోక్‌సభ సభ్యుడు డాక్టర్.తోల్ తిరుమావళన్ జన్మదినాన్ని లౌకిక పరిరక్షణ దినంగా నిర్వహించినట్లు భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం.శివప్రసాద్ తెలిపారు. మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శివప్రసాద్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగం ప్రవచించిన లౌకికత్వానికి మోదీ ప్రభుత్వం ముప్పు తలపెట్టిన నేపథ్యంలో లౌకిక పరిరక్షణ దినం నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా మలుపుతిప్పి తమిళనాడు రాజకీయాల్లో వీసీకే పార్టీని తిరుగులేని శక్తిగా తిరుమావళన్ తయారు చేశారన్నారు. సామాన్యులను పాలకులుగా చేసేందుకు పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయన్నారు. కాలనీ గేట్ వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. గణపతి, ముత్యాలమోహన్, పాలకుంట శ్రీనివాసులు, పల్లంతాతయ్య, నీరుగట్టిరమణ, పీర్‌బాషా, వి.దొరస్వామి పాల్గొన్నారు.

కలుపుతీత పనుల్లో రైతులు నిమగ్నం


వేరుశెనగ పొలంలో కలుపు తీస్తున్న కూలీలు

రామసముద్రం: వేరుశనగ కలుపు తీత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో దాదాపు 1100 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు రాయితీపై పంపిణీ చేసినా వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం 275 ఎకరాల్లోనే రైతులు వేరుశెనగ సాగు చేశారు. గతంలో 2,500 ఎకరాల వరకు సాగవగా, ఈ ఏడాది అదునులో వర్షం కురవకపోవడంతో విస్తీర్ణం తగ్గిపోయింది. వర్షాలు పడకపోయినా రైతులు ఎండు దుక్కిలోనే విత్తనాలు వేశారు. కలుపును చేధించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రూ.350, ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అయితే రూ.500 ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. పలువురు రైతులు కూలీ ఖర్చులకు భయపడి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నారు.

కూలీల ఖర్చులు అధికం



ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం చేయాలంటే పెట్టుబడులు, కూలీల ఖర్చులు భరించలేకపోతున్నాం. ఎకరా వేరుశెనగ పంట సాగుకు సుమారు రూ.20 వేలు ఖర్చు చేయాల్సి ఉంది. దిగుబడి చూస్తే అంతంత మాత్రంగా ఉంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సి ఉంది. – శ్రీనాథ్, గుంతయంబాడి

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు


వాల్మీకిపురం ఆరమడక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కలికిరి తోపుకాడపల్లి చర్చిలో

కలికిరి(వాల్మీకిపురం): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదలవ్వాలని కోరుతూ వాల్మీకిపురం మండలం మూగలమర్రి పంచాయతీ ఆరమడక గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా వాలంటీరు విభాగం ప్రధాన కార్యదర్శి యోగేంద్రనాథరెడ్డి, మూగలమర్రి సర్పంచ్ భాస్కర్, నాయకులు మనోహర, కార్తీక్‌రెడ్డి, శేషప్ప, చిన్న, గంగులప్ప, ఉప్పు భాస్కర, ఎం.గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డికి త్వరగా బెయిల్ మంజూరవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీడి హరి కోరారు. కలికిరి క్రాస్ రోడ్డు తోపుకాడపల్లి చర్చిలో ఆదివారం ప్రార్థనలు నిర్వహించారు. ఫాస్టర్లు సెల్వరాజ్, రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు సి.సహదేవ, రామక్రిష్ణ, ఎం.సహదేవ, గంగాధర, చంద్ర, క్రిష్ణ, మణి, సందీప్, గిరి, సుధాకర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె: ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ప్రార్థిస్తూ మదనపల్లెలోని గంగమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఆదివారం పూజలు నిర్వహించారు. 101 టెంకాయలు కొట్టి గంగమ్మను ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదరణ కలిగిన మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసి వేధిస్తున్న ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాసులు, రేవన ముని, రమేష్, మునిశేఖర్, రామాంజులు, మధు, అనిల్, శారదారెడ్డి, ముజీబ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న నిసార్ అహ్మద్

ఏనుగుమల్లమ్మకు పూజలు


అలంకరణలో ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏనుగు మల్లమ్మ విగ్రహానికి వెండిచీర, కిరీట, కవచం అలకరించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు, సందర్శకులు దర్శించుకుని పూజలు చేశారు.

ముళ్లపొదల తొలగింపు


ముళ్ల పొదలు తొలగిస్తున్న ఎక్స్‌వేటర్

కలికిరి: మండలంలోని గడి–పల్లవోలు రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోయాయి. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సర్పంచ్ బీబీ అయేషా ఆదివారం ఎక్స్‌వేటర్‌తో మొక్కలను తొలగించారు. నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మదనపల్లెలో ఎమ్మెల్యే

మదనపల్లె: మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నరెడ్డెప్పరెడ్డి కుమారుడు జగదీష్‌రెడ్డి, శివకుమారిల వివాహం ఆదివారం మదనపల్లెలో జరిగింది. ఈ వేడుకకు పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనవెంట మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి సమన్వయకర్త నిసార్ అహమ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, దండాల రవికుమార్‌రెడ్డి, సర్పంచు నాగిరెడ్డి, బావాజాన్, బండపల్లె అక్కులప్ప తదితరులు హజరయ్యారు. పెద్దిరెడ్డి వేడుకకు హజరైన వారిని ఆప్యాయంగా పలుకరించారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

30 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక


సత్కారం అందుకున్న గురువులతో విద్యార్థులు

బి.కొత్తకోట: స్థానిక సాయిశ్రీ హైస్కూల్‌లో 1993–94లో పదోతరగతి చదువుకున్న నాటి విద్యార్థులు మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ వేదికగా 30ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఆట పాటలు, విందు వినోదాలతో సందడి చేశారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఆ తర్వాత ఉన్నత చదువులు, వృత్తి, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వారంతా మళ్లీ కలుసుకుని పాత రోజులను గుర్తు చేసుకున్నారు. శనివారం రాత్రి ఆర్కెస్ట్రా పాటలకు డ్యాన్సులు వేస్తూ సందడి చేశారు. ఒకరినొకరు కలుసుకుని తమ కుటుంబాలతో కలిసి పరిచయాలు చేసుకున్నారు. నాటి గురువులు గౌస్‌పీర్, ఆన్సర్, మురళీ, రంగారెడ్డి, శేఖర్, హరినాథ్, ఇనాయతుల్లా, సుబ్బారెడ్డి తదితరులను కర్ణాటక సంప్రదాయంలో శాలువలు, సుగంధ మాలలతో ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. తర్వాత అంతా కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని కె.ఖాదర్‌వలి, నిజాం బేగ్, కాచిపల్లె శంకర్‌రెడ్డి, బొమ్మసాని రాజా, మేడా రఘు, మురళీ, జిన్నా, నగేష్ నిర్వహించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో రాహుల్‌చక్రవర్తి

కలికిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ యువత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కలికిరి మండలానికి చెందిన సి.రాహుల్ చక్రవర్తిరెడ్డి ఆదివారం ఆయనను తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో అల్లరిమూకల ఆటకట్టిస్తాం


సీఐ యుగంధర్

పీలేరు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అల్లరిమూకల ఆటకట్టిస్తామని సీఐ యుగంధర్ అన్నారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లపై బర్త్ డే కార్యక్రమాలు నిర్వహించడం, బాణసంచా పేల్చడం, ప్రజలను ఇబ్బంది కల్గించే కార్యక్రమాలు చేపడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రెండు రోజుల క్రితం మహిళను వేధించిన కేసులో చెన్నారెడ్డి వీధిలోని అన్వేష్‌రెడ్డి, శ్రావణ్, షబ్బీర్, శ్యామ్, మహేంద్రలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కల్గించిన కడప రోడ్డులో రమేష్‌నాయక్, బన్నీ, నితీష్, రియాజ్‌లపై కేసులు నమోదు చేసి, ఎనిమిది ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై 193, 194 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. యువతపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని, రాత్రి 10.30 గంటల తరువాత యువత రోడ్లపై కన్పిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.

ముత్తు మారమ్మకు అంబళ్లు సమర్పణ


అమ్మవారిని దర్శించుకుంటున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


ప్రత్యేక అలంకరణలో ముత్తుమారమ్మ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఆదివారం ముత్తు మారమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి అంబళ్లను సమర్పించారు. ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమలై ఆహ్వానం మేరకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ముత్తు మారమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆకేపాటిని పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ నాయనపల్లి అనుదీప్, వైఎస్ఆర్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, యువ నాయకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, చొప్ప నరసింహారెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నూకా నాగేశ్వరరెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, విజయుడు, పాదిలి దేవి తదితరులు పాల్గొన్నారు.